ఎఐటిఎస్‌లో ఎన్‌సిసిపై అవగాహన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మాట్లాడుతున్న పీడీ విజయ భాస్కర్

అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం కళాశాల ఫిజికల్ డైరెక్టర్, ఎన్‌సిసి కో-ఆర్డినేటర్ బి.నాగముని ఆధ్వర్యంలో ఎన్‌సిసిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పుల్లంపేట ఎంఇఒ బి.చక్రధర్ రాజు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీడీ మేజర్ సి.విజయ్ భాస్కర్ పాల్గొని బిటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న మహిళా విద్యార్థులకు ఎన్‌సిసిపై అవగాహన కల్పించారు. టెక్నికల్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఎన్‌సిసి చాలా ముఖ్యమని తెలిపారు. ఎన్‌సిసి వల్ల ప్రభుత్వ ఉద్యోగాలు పొందవచ్చని తెలిపారు. నేవీ, ఎయిర్ ఫోర్స్, ఆర్మీ తదితర ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎన్‌సిసి వలన మానసికంగా, శారీరకంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్‌సిసి సిటిఒ ఎన్.దీప్తి, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ ఎస్.సైఫుల్లా, విద్యార్థినులు పాల్గొన్నారు.

అభివృద్ధిని విస్మరించిన ప్రభుత్వం

మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్, హాజరైన పార్టీ సభ్యులు

- బటన్ నొక్కుడు తప్ప అభివృద్ధి శూన్యం
- రాయలసీమలో తీవ్ర నీటి ఎద్దడి
- నవంబర్ 10న ప్రజారక్షణ భేరి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్

ప్రజాశక్తి-కడప అర్బన్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ అన్నారు. శనివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో జిల్లా స్థాయి శిక్షణ తరగతులకు ముఖ్య అతిథులుగా హాజరైన ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పరిశ్రమలు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, సాగునీటి ప్రాజెక్టులు గాలికి వదిలేసి బటన్ నొక్కడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించిందని తెలిపారు. ప్రజలు, ప్రతిపక్షాల ప్రాథమిక హక్కులను సైతం నిర్వీర్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధికి సంబంధించి ఎటువంటి ప్రణాళికలు లేకపోగా వలసలతో పాటు కర్నూలు, అనంతపురం జిల్లాల్లో తీవ్రమైన నీటి ఎద్దడి నెలకొందన్నారు. సరైన పరిపాలన అందించకుండా తన అజెండాతో ప్రజలను అణచివేయాలనుకోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాన్ని శాశిస్తూ రాయలసీమకు, ఉత్తరాంధ్రకు ఎటువంటి నిధులివ్వడం లేదని తెలిపారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు అమరావతి అజెండా తప్ప ఎటువంటి అభివృద్ధి లేదన్నారు. ఇప్పుడు వైసిపి ప్రభుత్వం 30 ఏళ్లు మేమే పరిపాలించాల అనే అణచివేత ధోరణితో ప్రవర్తిస్తోందని విమర్శించారు. రాయలసీమలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులు నిధులు లేక అటకెక్కాయని చెప్పారు. అప్పర్‌భద్ర ప్రాజెక్టు వల్ల తుంగభద్రకు భవిష్యత్తులో నీళ్లు వచ్చే అవకాశం లేదని తెలిపారు. తద్వారా కెసి కెనాల్ ఆయకట్టు రైతాంగం భవిష్యత్తులో ఇబ్బందులకు గురవుతారని పేర్కొన్నారు. వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో పరిశ్రమలో నిర్మించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాల్సిన ముఖ్యమంత్రి ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి మూడు దపాలుగా శిలాఫలాకాలకే పరిమితమయ్యారన్నారు. కేంద్ర నిఘా సంస్థలు హోం మంత్రికి పక్కా సమాచారం ఇచ్చారని తెలిపారు. చంద్రబాబు అరెస్టుకు బిజెపి కారణమన్నారు. టిడిపి కూడా బిజెపి పట్ల సానుకూల వైఖరి మంచి పద్ధతి సరికాదన్నారు. చంద్రబాబును అరెస్టు చేసే విధానాన్ని ఆయన ఖండించారు. న్యాయస్థానాలు ఆలస్యం చేయకుండా తీర్పులు ఇవ్వాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని వర్గాల ప్రజలపై పోటీపడి భారాలు వేస్తున్నాయని ఈ బారాలకు వ్యతిరేకంగా రానున్న కాలంలో ప్రజా పోరాటాలకు శ్రీకారం చుడుతున్నామని పేర్కొన్నారు. ఆయా ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో మూడు ప్రాంతాలలో ఈ నెల 21వ తేదీ నుంచి బస్సు జాతాలు ప్రారంభమవుతాయని తెలిపారు. రాయలసీమ బస్సు జాత ఆదోనిలో ఈ నెల 21న ప్రారంభమై కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు, నెల్లూరు, మీదుగా విజయవాడకు చేరుకుంటుందని పేర్కొన్నారు. ఈ మూడు ప్రాంతాల్లో బస్సు జాతాల ముగింపు సందర్భంగా నవంబర్ 10వ తేదీన విజయవాడలో ప్రజారక్షణ భేరి పేరుతో భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆయన పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామమోహన్, మనోహర్, శివకుమార్, ఐఎన్.సుబ్బమ్మ, జిల్లా కమిటీ సభ్యులు సత్యం, దస్తగిరిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, అన్వేష్, విద్యార్థి, యువజన సంఘం నాయకులు శివకుమార్, సునీల్, రాజేంద్ర, చిన్ని, ఓబులేసు, షాకీర్, నాయకులు వెంకటసుబ్బయ్య, చంద్రారెడ్డి, భైరవ ప్రసాద్, చాంద్ బాషా, మండల శాఖా కార్యదర్శులు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

పైసల్లేని పంచాయతీలు

- ఆదాయం లేక పల్లెలకు భారంగా మారిన అభివృద్ధి పనులు
- నిధుల లేమితో కుంటుపడిన పాలన
- అప్పుల ఊబిలో సర్పంచ్‌లు

ప్రజాశక్తి- రాయచోటి

మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం నేడు నవ్వుల పాలవుతున్నది. పంచాయతీల అభివృద్ధి జరిగితేనే జిల్లాలు, రాష్ట్రం ఎంతో అభివృద్ధి పథంలో నడుస్తాయనే భావన అప్పట్లో ఉండేది. అన్నమయ్య జిల్లాలో 501 గ్రామ పంచాయతీలు ఉండగా, ఆరు గ్రామ పంచాయతీలో ఏకగ్రీవమైనవి. బి.కొత్తకోట మండలం గొల్లపల్లి పంచాయతీలో రూ.10 లక్షలు, పెద్దతిప్పసముద్రం మండలంలో కట్నగుల్ల గ్రామంలో రూ.10 లక్షలు, మదమూరు గ్రామంలో రూ.5 లక్షలు, నవాబకోట గ్రామంలో రూ.10 లక్షలు, రంగసముద్రం గ్రామంలో రూ.10 లక్షలు, వాల్మీకిపురం మండలంలో నగిరిమడుగు రూ.5 లక్షలు మొత్తం రూ.50 లక్షలు మంజూరైనట్లు అధికారులు చెబుతున్నారు. కానీ నేడు మిగిలిన పంచాయతీల్లో నిధులు లేక అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందాన మారింది. మౌలిక వసతులు లేమితో పంచాయతీలు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయి. ముఖ్యంగా పారిశుధ్య పనులు, వీధిలైట్లు, సిసి రోడ్లు, మోటార్ల మరమ్మతులకు కూడా పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో పనులు చేయలేక ఇబ్బందులు సర్పంచ్‌లు ఇబ్బంది పడుతున్నారు. వారి పరిధిలోని గ్రామాల్లో అరకొర సిసి రోడ్లు, పలు రకాల పనులు చేసి పనులకు రావాల్సిన బిల్లులు అందకపోవడంతో వడ్డీలు చెల్లించలేక అప్పుల బాధతో మానసిక క్షోభ అనుభవిస్తున్నారు. అప్పులు తెచ్చిన కాడ వడ్డీలు కట్టలేక వారు మాట్లాడే మాటలకు తలవంచి దయనీయమైన స్థితిలో ఉండాల్సిన పరిస్థితిలో సర్పంచులున్నారు. సర్పంచుల ఖాతాల్లో ఉండాల్సిన సొమ్మును ప్రభుత్వమే రాష్ట్రంలోని అన్ని పంచాయతీల్లో నిధులు లేకుండా ఖాళీ చేసింది. సర్పంచ్‌లు ప్రభుత్వంపై విసిగి పోతున్నారు. వైసిపికి చెందిన సర్పంచ్‌లే నేడు ఎందుకు పార్టీలో ఉన్నామంటూ ఇప్పటికే రాజీనామాలు కూడా చేసి తిరుగుబాటు చేస్తున్నారు. చాలామంది సర్పంచ్‌లు రాబోయే రోజుల్లో ఇక ఎన్నికలకు దిగబోమంటూ చంపలేసుకుంటున్నారు. సర్పంచ్ పదవులు తమకొద్దని నిర్మొహమాటంగా చెప్పకనే చెబుతున్నారు. నేడు పంచాయతీలలో పనులు చేసేందుకు నిధులు లేకపోవడంతో ఎవరికి వారే యమునా తీరే అన్న సంధాన ఉండిపోతున్నది. మేజర్ గ్రామ పంచాయతీలో ప్రజల నుండి చెత్త పన్ను, నీటి పన్ను, ఆస్తి పన్ను పేర్లతో ఆ డబ్బులను ఖజానాకు జమ చేస్తూ కొంత సొమ్మును ధైర్యం చేసి పంచాయతీ పనులకు ఖర్చు చేస్తున్నారు. పంచాయతీల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులకు కూడా సక్రమంగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికలలో పెట్టిన ఖర్చులకు వడ్డీలు కూడా పనులు చేయలేకపోతున్నామని సర్పంచులు ఆందోళన చెందుతున్నారు. ఏది

ఏమైనప్పటికీ అన్నమయ్య జిల్లాలోని అన్ని మండలాల్లో పంచాయతీల పరిస్థితి ధైర్యంగా మారింది.

ఒక పని కూడా చేయలేదు

సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తయింది. ఇంతవరకు గ్రామంలో ఒక పని కూడా చేపట్టలేదు. పంచాయతీలలో ఎస్సీ, ఎస్టీ నిధులు కూడా రావడం లేదు. కేంద్ర ప్రభుత్వం 15 ఫైనాన్స్ కింద రూ.8,6,60 కోట్లను విడుదల చేసిన బడ్జెట్‌ను కూడా రాష్ట్ర ప్రభుత్వం దోచుకుంది. ఎన్నికలలో పెట్టిన డబ్బులకు కనీసం వడ్డీలు కట్టుకోలేక ఇబ్బందులు గురవుతున్నాం. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సర్పంచి గ్రాండ్లను విడుదల చేయాలి.

- పల్లపు వాసు, సర్పంచ్, పేమ్మడపల్లె, రాయచోటి.

ఆందోళన అవసరం లేదు

గ్రామ పంచాయతీలలో 15 ఫైనాన్స్ కింద ఒకసారి బడ్జెట్ విడుదల చేశారు. త్వరలో మరొక సారి 15 బడ్జెట్‌ను మంజూరు చేస్తాం. ఏకగ్రీవమైన పంచాయతీలలో బడ్జెట్ విడుదల చేశాం. గడప గడపలో భాగంగా ప్రతి సచివాలయ పరిధిలో రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నాం. చేసిన పనులు కూడా బిల్లులు అందజేస్తున్నాం. రాబోయే రోజులలో మరింత గ్రామపంచాయతీలో అభివృద్ధి చేయడానికి అన్ని చర్యలు తీసుకుం టున్నాం. సర్పంచ్‌లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

-ధనలక్ష్మి, డిపిఒ, రాయచోటి.

కాలువ పనులను పరిశీలిస్తున్న షేక్ ఇర్ఫాన్

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె రూరల్ మండలంలోని కొత్తిండ్లు గ్రామ పంచాయతీలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా సిమెంట్ మురుగునీటి కాలువల నిర్మాణం చేపట్టడం జరిగిందని సర్పంచ్ షేక్ అసియా బేగం అన్నారు. సర్పంచ్ ఆదేశాలతో ఆమె కుమారుడు షేక్ ఇర్ఫాన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజల అభీష్టం మేరకు ఎన్నో ఏళ్లుగా పెండింగ్ ఉన్న మురికినీటి సమస్యను పరిష్కరించడం జరిగింది. రెండు సంవత్సరాలుగా అనేక అభివృద్ధి పనులు గ్రామ పంచాయతీలో చేపట్టి ఆదర్శంగా నిలిచామని తెలిపారు. మరిన్ని అభివృద్ధి పనుల ప్రతిపాదనలు పురోగతిలో ఉన్నాయని అవి కూడా తొందరలోనే కార్యరూపం దాల్చుతాయని పేర్కొన్నారు. మున్సిపాలిటీకి సరిహద్దులో వున్న గ్రామ పంచాయతీని అన్నివిధాలుగా అభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు.

రాజమండ్రి సెంట్రల్ జైలును ముట్టడిస్తాం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

చంద్రబాబు నాయుడు ప్రాణాలు కాపాడడానికి రాజమండ్రి సెంట్రల్ జైలును ముట్టడించడానికి కూడా వెనకాడబోమని టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ అన్నారు. శనివారం గుండ్లూరులో మోకాళ్లపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్ర బాబు ఆరోగ్యంపై పలు అనుమానాలు ఉన్నాయన్నారు. చంద్రబాబు అనారోగ్యంతో బాధపడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం సరైన వైద్యం అందిం చలేదన్నారు. ఆంధ్ర రాష్ట్ర భవిష్యత్తు చంద్రబాబుతోనే ఉందని తెలిపారు. కార్యక్రమంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు శివ, నరేంద్ర, యానాది, చంద్ర పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలి

ప్రజాశక్తి-పీలేరు

గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని కేరళ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ (కిలా) ప్రతినిధి సోనియా జోష్ తెలిపారు. శనివారం పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని కిలా ప్రతినిధులు సందర్శించారు. గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సోనియా జోష్ మాట్లాడుతూ వాలంటీర్ల సేవలు బాగున్నాయని అభినందించారు. పంచాయతీలో రికార్డుల నిర్వహణపై సూచనలు, సలహాలు ఇచ్చారు. పంచాయతీల అభివృద్ధి కృషి చేయాలని, ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. మదనపల్లె డిఎల్‌పిఒ నాగరాజు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద పీలేరు, రైల్వేకోడూరు గ్రామ పంచాయతీలు ఎంపికైనట్లు తెలిపారు. అందులో భాగంగా కేరళ బృందం సందర్శించినట్లు తెలిపారు. కార్యకరమంలో సర్పంచ్ జీనత్, జెన్నీ, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షఫీ, ఇఒ రెడ్డిప్రసాద్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఇఒపిఆర్‌డి జయమ్మ, పంచాయతీ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సోనియా జోష్

ప్రజాస్వామ్య విలువలను హరిస్తున్న సిఎం జగన్ : టిడిపి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రజాస్వామ్య విలువలను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి కాలరాస్తున్నారని మాజీ మంత్రి ఎన్.అమరనాథ్‌రెడ్డి ఆరోపించారు. శనివారం అంగళ్లు ఘటనలో తమపై నమోదైన తప్పుడు కేసులకు బెయిల్ మంజూరు కావడంతో రాజంపేట ఎంపీ అభ్యర్థి గంట నరహరి, మదనపల్లి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొమ్మలపాటి రమేష్‌తో కలిసి డిఎస్‌పి కార్యాలయానికి వెళ్లారు. అనంతరం బైపాస్ రోడ్డులోని టికెఎన్ ఎస్టేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్.అమరనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఒక్క అవకాశం పేరుతో గద్దెనెక్కిన ముఖ్యమంత్రి జగన్ ప్రతిపక్ష పార్టీ నాయకులపై కక్షపూరిత ధోరణి వ్యవహరిస్తున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును స్కిల్ డెవలప్మెంటులో అక్రమాలు జరిగాయని తప్పుడు కేసులు బనాయించి 35 రోజులు పాటు జైల్లో పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఒక మాజీ ముఖ్యమంత్రికే రక్షణ లేదని, ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. శాంతిభద్రతలు రాష్ట్రంలో పూర్తిగా కొరవడ్డాయనడానికి ఇవే సాక్ష్యాలన్నారు. అనంతరం గంటా నరహరి మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారన్నారు. చంద్రబాబుపై అక్రమ కేసులు విషయంలో తమకు సంబంధం లేదని కిషన్‌రెడ్డి ద్వారా కేంద్ర హోం మంత్రి అమిత్ షా దగ్గర నారా లోకేష్‌కు తెలియజేశారన్నారు. కార్యక్రమంలో టిడిపి స్టేట్ మీడియా కో-ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, యువ నాయకులు దొమ్మలపాటి యశస్వి రాజ్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి ఎస్.ఎం.పర్వీన్‌తాజ్, టిడిపి రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్, ఎస్.ఎం.రఫీ, ఎస్.ఎ.మస్తాన్, దేవరింటి శ్రీనివాసులు, తులసీదర్ నాయుడు, దొరస్వామి నాయుడు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నరహరి

'మానవ అక్రమ రవాణా ప్రమాదకరం'

మదనపల్లె : సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి వెంకటేశ్వర్లు నాయక్

ప్రజాశక్తి - రాయచోటి

మానవ అక్రమ రవాణా మానవాళికి వ్యతిరేకమని ఇది చాలా ప్రమాదకరమని ఎస్‌డిహెచ్‌ఆర్ డిగ్రీ కళాశాల చైర్మన్ హరినాథరెడ్డి, విఆర్‌డిఎస్ సురేంద్రరెడ్డి అన్నారు. శనివారం మూమెంట్ ఇండియా, గ్రామ జ్యోతి సొసైటీ వారి సహకారంతో విఆర్‌డిఎస్ ఆధ్వర్యంలో స్థానిక డిగ్రీ కళాశాలలో 'వాక్ ఫర్ ఫ్రీడమ్' మానవ అక్రమ రవాణా అనేకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచ వ్యాప్తంగా జరిగే మానవ హక్కుల ఉల్లంఘన అన్నారు. దోపిడీ, బలవంతపు శ్రమ, బానిసత్వం, మంచి జీతంతో కూడిన ఉద్యోగాలు, భిక్షాటన వంటి అనేక రూపాల్లో బాధితులు అక్రమ రవాణా చెయబడుతున్నారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మాదక ద్రవ్యాలు, ఆయుధాలు వ్యాపారం తర్వాత మానవ రవాణా అనేది అతి పెద్ద వ్యవస్థీకృత నేరం అన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులు ప్లకార్డులు చేతపట్టి ర్యాలీగా వాక్ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రెడప్ప రెడ్డి, లెక్చరర్లు నాయుడు, మహమ్మద్, వెంకట రమణ, గుణశేఖర్ రెడ్డి, రెడ్డయ్య, రామంజులు, శివ సాయి క్రిష్ణ, జనార్ధన్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** మూమెంట్ ఇండియా సౌజన్యంతో గ్రామజ్యోతి సొసైటీ ఆధ్వర్యంలో వాక్ ఫర్ ఫ్రీడమ్ కార్యక్రమాన్ని అక్టోబర్ 14వ తేదీ స్వేచ్ఛ కోసం నడక అనే బృహత్తర సైలెంట్ వాక్కును జిఆర్టి హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి న్యాయమూర్తి వెంకటేశ్వర్లు నాయక్, ఆర్‌డిఒ మురళి, డిఎస్‌పి కేశప్ప, వన్ టౌన్ సిఐ మహబూబ్ బాషా, గ్రామ జ్యోతి సొసైటీ డైరెక్టర్ బి.సుభద్రలు హాజరయ్యారు. వాక్ ఫర్ ఫ్రీడమ్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని పిల్లలకు అవగాహన కల్పిస్తూ పెద్దఎత్తున చేపట్టిన ర్యాలీని న్యాయమూర్తి జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక జిఆర్టి హైస్కూల్ నుండి ప్రారంభమైన ర్యాలీ బెంగళూరు బస్టాండ్, టౌన్ బ్యాంక్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా జడ్పీ హైస్కూల్ వరకు కొనసాగింది. కార్యక్రమానికి విశ్వం డిగ్రీ కళాశాల, బి.టి.డిగ్రీ కళాశాల,ఉమెన్స్ డిగ్రీ కాలేజ్, గుడ్ విల్ కంప్యూటర్స్, జడ్పీ హైస్కూల్, వెలుగు పాఠశాల, జిఆర్టి స్కూల్ నుండి సుమారు 1200 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్ఒడి ఆఫ్ కామర్స్ లక్ష్మీనారాయణ, వై.ఎస్.మునిరత్నం, విఎస్ఆర్ గ్రాండ్ సుధాకర్ రెడ్డి, వెలుగు ఉదయ మోహన్ రెడ్డి పాల్గొన్నారు. **పీలేరు :** మూమెంట్ ఇండియా సౌజన్యంతో గ్రామ జ్యోతి సొసైటీ సూచనల మేరకు షీ సంస్థ ఆధ్వర్యంలో పీలేరులో వాక్ ఫర్ ఫ్రీడమ్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. వివేకానంద సర్కిల్ నుంచి ఆర్‌టిసి బస్టాండు వరకు స్వేచ్ఛ కోసం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో షీ సంస్థ అధ్యక్షులు డాక్టర్ పివిస్ లక్ష్మీ, న్యాయ సలహాదారులు డాక్టర్ రాయల సుధాకర రాయలు, మాజీ ఎమ్మెల్యే జివి శ్రీనాథ్ రెడ్డి, విఎస్ఎన్ సిద్ధార్థ స్కూల్ అధినేత్రి వడ్లమూడి మాధవి, విద్యార్థులు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి:** మూమెంట్ ఇండియా వారి సౌజన్యంతో హెల్పింగ్ మైండ్స్ ఆధ్వర్యంలో వాక్ ఫర్ ఫ్రీడమ్ ర్యాలీ వైఎస్ఆర్ సర్కిల్ నుండి రాగిమాను వరకు నిర్వహించారు. ర్యాలీని తంబళ్లపల్లె ఎస్ఐ రెడ్డప్ప జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు సిరాజ్, తుపాకుల శివ, నాగేంద్ర, పురుషోత్తం, సాకే ప్రవీణ్, కళ్యాణ్, బావదీశ్, లోకేష్, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

విశ్వరూప మహా పాదయాత్రకు తరలిరండి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

దళిత వర్గంలోని అన్ని కులాల సామాజిక న్యాయం, వర్గీకరణ సాధన కోసం దళిత వర్గాల పక్షాన మందకృష్ణ చేపట్టిన విశ్వరూప మహాపాదయాత్రకు తరలిరావాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు చేమూరు వెంకటేష్, మందా శ్రీనివాసులు, మందా శివయ్య, జడ శివ పిలుపునిచ్చారు. శనివారం పట్టణ పరిధిలోని ఎర్రబల్లి రామాలయంలో విశ్వరూప మహాసభకు సంబంధించిన గోడ పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్ వల్ల దశాబ్దాలుగా విద్య ఉద్యోగ సంక్షేమ రాజకీయ రంగాలలో తీవ్రంగా నష్టపోయిన మాదిగలు ఉపకులాల పక్షాన నిలబడి ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ జరపాలని ఎమ్మార్పీఎస్ 20 సంవత్సరాలుగా ఉద్యమిస్తోందన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో మాదిగ, ఉప కులాల విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. ఆనాటి నుండి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ ఆధ్వర్యంలో వర్గీకరణ సాధన కోసం అలుపెరగని పోరాటాలు చేయడం జరుగుతోందని పేర్కొన్నారు. కొన్ని దశాబ్దాలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, వికలాంగ ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి రాష్ట్ర నాయకులు మదనపల్లి పెంచలయ్య, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు మినుకు ఆదెయ్య, రేవూరి గంగాధర్, రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

చలో గుంటూరు జయప్రదం చేయండి

- దూదేకుల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇందాదుల్లా

ప్రజాశక్తి -పీలేరు

ఆంధ్రప్రదేశ్ నూర్ బాష దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 29న గుంటూరులో జరగనున్న కార్యాక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని నూర్‌బాష దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇందాదుల్లా పిలుపునిచ్చారు. శనివారం పీలేరు వివేకానంద సర్కిల్లో జరిగిన కార్యక్రమంలో చలో గుంటూరు పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో ఏడు శాతం ఉన్న నూర్‌బాష ముస్లిం సంక్షేమానికి అన్ని రంగాల్లో హక్కులు కల్పించాలని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారినా, తరాలు మారినా ఎక్కడ వేసినగొంగళి అక్కడే ఉన్న చందంగా ఉన్నామన్నారు. రాష్ట్రంలో రెండు, మూడు శాతం ఉన్న వారు కూడా చట్టసభల్లో ఉండి రాజకీయాల్లో చలామణి అవుతున్నారని, 30లక్షలకు పైగా జనాభా ఉన్న మాకు ఏ రాజకీయ పార్టీ అవకాశం కల్పిస్తే ఆపార్టీకి సంపూర్ణ మద్దతు తెలియజేస్తామన్నారు. స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి నూర్ భాషా దూదేకుల కులానికి ఏ రాజకీయ పార్టీ చట్టసభల్లో అవకాశం కల్పించలేదని, అలాగే వచ్చే 2024 ఎన్నికల్లో తప్పనిసరిగా అన్ని రాజకీయ పార్టీలు తమ కులానికి అవకాశం కల్పించాలని కోరుతూ ఈ సభకి 29న రాష్ట్ర నలుమూలల నుండి దూదేకుల నూర్ భాషా సోదర సోదరీమణులు ఏకమై మన ఉనికిని చాటాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులేసు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కె.షఫీ, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఎన్ ఇమాములు అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అమీర్ భాష, రాయచోటి ప్రెసిడెంట్ ఖాదర్ జి.ఫజులుల్లా, రాష్ట్ర ఉపాధ్యక్షులు యువజన సంక్షేమ సంఘం అన్నమయ్య జిల్లా నాయకులు ఫజులుల్లా, డైరెక్టర్ జిల్లా వర్ఫ్ బోర్డ్ నాయకులు రహమ్ తుల్లా, మస్తాన్, హుస్సేన్, కరీముల్లా పాల్గొన్నారు.

కర్నూలుకు తరలిన ఎంఆర్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి

ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు ఉసురు పాటి బ్రహ్మయ్య మాదిగ అధ్యక్షతన కర్నూలులో నిర్వహించబోయే రాయలసీమ జిల్లాల సదస్సుకు శనివారం ఎంఆర్‌పిఎస్ నాయకులు తరలి వెళ్లారు. ఈ సంద్భంగా ఎమ్మార్పీఎస్ కో - కన్వీనర్ ఎస్. రామాంజనేయులు మాట్లాడుతూ మాదిగల అభివృద్ధికి, వారి ప్రయోజనాల కోసం కార్యక్రమం నిర్వహిస్తున్న అన్నారు. రాయలసీమ జిల్లాల సదస్సుకు ఎమ్మార్పీఎస్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు అశోక్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు పెద్దివిటి రమణ, జిల్లా నాయకులు వీరబల్లి నరసింహులు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రామయ్య, ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు నారాయణ, వెంకటరమణ (చిన్నబ్బి), సుబ్బయ్య,యండపల్లి పిచ్చయ్య, చిన్న, సురేష్ బాబు, నాని, మాదిగ, గాలివీడు ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షులు రాయచోటి రమణయ్య, చీమలచెరువు పల్లె మాజీ సర్పంచ్ రాయచోటి జయ రామయ్య, వెంకటేష్, రాజశేఖర్, సుండుపల్లి సుబ్బయ్య, వెంకట కృష్ణ, బుజ్జి, ఎంఆర్‌పిఎస్ నాయకులు, కార్యకర్తలు వెళ్లారు.

కర్నూలుకు తరలివెళుతున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

డిఇని సన్మానిస్తున్న ఎఇ గిరిధర్

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని అధికారులు, సిబ్బందిని విద్యుత్ శాఖ నూతన డిఇ యుగంధర్ ఆదేశించారు. ఆయన ఇటీవల నూతన డిఇగా బాధ్యతలు స్వీకరించారు. విద్యుత్‌శాఖ కార్యాలయంలో సెక్షన్ మీటింగ్ ఏర్పాటు చేసి ఉద్యోగులకు తగు సూచనలు,సలహాలిచ్చారు. జిఎస్ సర్వేని త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. రైతులు,ప్రజలకు విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలన్నారు. అనంతరం డిఇని అధికారులు, సిబ్బంది పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎఇడి రుక్మనందబాబు, ఎఇ గిరి, ఎల్.ఐ యర్రంరెడ్డి, రెడ్డెప్ప సిబ్బంది పాల్గొన్నారు.

నది వంతెనపై మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

వంతెనకు మరమ్మతులు

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడకు సమీపంలో ఉన్న చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై సత్యవతి నదిపై నిర్మించిన వంతెన మరమ్మతుకు గురైంది. అనేక పర్యాయాలు పలువురు ఫిర్యాదులు చేసినా ఎన్‌హెచ్ హైవే అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. వంతెన గుంతల మయమై చిన్నపాటి వర్షానికి సైతం దారి కనిపించకుండా గుంతలలో నీరు నిలిచి ద్విచక్ర వాహనాలు పలు ప్రమాదాలకు గురయ్యేవారు.ఎట్టకేలకు స్పందించిన అధికారులు వంతెనపై దృష్టి సారించి శుక్రవారం, శనివారం రెండు రోజుల పాటు మరమ్మతులు చేపట్టారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి : ఎస్‌ఎఫ్‌ఐ

కడప అర్బన్ : జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలు సెలవు దినాల్లో సైతం తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల స్వేచ్ఛను హరిస్తున్నాయని, అలాంటి పాఠశాలలపై జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గండి సునీల్ కుమార్, సగిలి రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని పలు కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలకు వెళ్లి తరగతులను అడ్డుకుని విద్యార్థులను బయటకు పంపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలకు ఈనెల 14 నుంచి 24 వరకు దసరా సెలవులకు ప్రకటించిందని చెప్పారు. అయితే జిల్లాలోని కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలు మాత్రం సెలవు దినాలను పాటించకుండా తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల స్వేచ్ఛను హరిస్తున్నారని తెలిపారు. సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నా కూడా జిల్లాలోని కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలు మాత్రం ప్రభుత్వ నిబంధనలను ఏమాత్రం పట్టించుకోకుండా తరగతులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రయివేట్ పాఠశాలను తనిఖీ చేసిన పాపాన పోలేదని విమర్శించారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు మనోజ్, నగర నాయకులు విహారి పాల్గొన్నారు.

రిమ్స్‌లో పనిచేయని లిఫ్ట్ : ఎన్ఎస్‌యుఐ

కడప : కడప జిల్లా రిమ్స్ జనరల్ హాస్పిటల్‌లో పని చేయని లిఫ్ట్‌తో రోగులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే మరమ్మతులు చేయాలని ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ల బాబు అన్నారు. రిమ్స్ ఆస్పత్రిలో ఉన్న రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మెరుగైన వైద్యం మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాకే ఎంతో పేరు గాంచిన రిమ్స్ జనరల్ హాస్పిటల్‌లో లిఫ్ట్‌ను వెంటనే తయారు చేయాలన్నారు. రిమ్స్ హాస్పిటల్‌లో కాన్పుల విభాగం, ఏమర్జెన్సీ వార్డ్‌లలో కూడా పూర్తిగా మౌలిక వసతులు వెంటనే ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. రిమ్స్ హాస్పిటల్‌లో కొన్ని విభాగాల డాక్టర్ల కొరత ఉందన్నారు. ముఖ్యంగా కార్డియాలాజీ విభాగం కొరత ఉంది అని అన్నారు. వెంటనే రిమ్స్ సూపరింటెండెంట్, ఆర్‌ఎంఒ, కలెక్టర్ రిమ్స్ సమస్యలు పరిష్కరించాలన్నారు.

కరువు భత్యం ఉత్తర్వులు విడుదల చేయాలి

కడప అర్బన్ : రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు దసరా కానుకగా పెండింగ్‌లో ఉన్న కరువు బత్యాలను చెల్లించే ఉత్తర్వులు విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరి పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ఎస్సార్ వెంకట జనార్ధన రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సకాలంలో జీతాలు చెల్లిస్తూ, కరువు భత్యం బకాయిలు లేకుండా చెల్లిస్తామని ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్నారని తెలిపారు. ఎంప్లాయ్ ఫ్రెండ్లీ ప్రభుత్వం అని నిరూపించుకోవాలంటే కరువు బత్యాన్ని ఇవ్వాలని పేర్కొన్నారు.

ప్రభుత్వాలు మొండి వైఖరి వీడాలి

ప్రజాశక్తి - కడప

విద్య, ఉపాధి పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి వీడాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జా తిరుమలేష్ అన్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలోనే అత్యధికంగా యువకులు ఉన్న దేశంగా భారతదేశ ఉంది. నేటి యువతరానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చదువుకు తగ్గ ఉద్యోగాలు ఇవ్వక, పరిశ్రమలను ఏర్పాటు చేయక, యువత నిరుద్యోగులగానే ఉండిపో తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ సమస్యలు పరిష్కరించడంలో అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం రెండు విఫలం చెందాయన్నారు. ప్రయివేటీకరణ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేటు గద్దలైన అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి హోదా ఇవ్వకుండా రాష్ట్ర ప్రజల నోట్లో మట్టి కొట్టారన్నారు. విభజన హామీలలో ప్రధానం కడప ఉక్కు అతి గతి లేదన్నారు. చావు కబురు చల్లగా చెప్పినట్టు పార్లమెంటులో సాధ్యం కాదన్నారు. మన రాష్ట్రంలో పాదయాత్రలో జగన్మోహన్ రెడ్డి ఊరూరా తిరుగుతూ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ఉన్న ఖాళీ పోస్టులు భర్తీ చేస్తానన్నాడు. కేవలం వాలంటీర్ల పోస్టుతోనే సరిపెట్టి ఇవే ఉద్యోగాలని యువతను మభ్యపెడుతున్నారన్నారు. సమావేశంలో పులివెందుల అసెంబ్లీ అధ్యక్షుడు కొమ్మది శ్రీ సాయి, యూత్ కాంగ్రెస్ నాయకులు అంబు మంజునాథరెడ్డి, కొమ్మది గణేష్, సుమంత్ కుమార్, అశ్విత్, పాల్గొన్నారు.

డాక్టర్ గునిశెట్టికి ప్రధాని ప్రశంసలు

కడప అర్బన్ : విద్యాశాఖ రిసోర్స్ పర్సన్ డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులుకు భారత ప్రధాని నరేంద్రమోడీ కార్యాలయం నుంచి ప్రశంసలు లభించాయి. విద్యార్థులకు పరీక్షలపై అవగాహన, భయం లేకుండా రాయడం లాంటి విషయాలపై లిపరీక్షా పే చర్చా -2023లి కార్యక్రమంలో ప్రధానమంత్రి విద్యార్థులతో ముఖాముఖి చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో అనుభవజ్ఞులు, నిపుణులు అయిన ఉపాధ్యాయుల నుంచి సూచనలు, సలహాలను స్వీకరించారు. ఈమేరకు శ్రీనివాసులు ప్రధాని కార్యాలయం నుంచి వ్యక్తిగతంగా రిజిస్టర్ పోస్ట్ ద్వారా ప్రశంస పత్రం అందుకున్నారు. ఆయన పెండ్లిమర్రి మండలం ఎగువ పల్లి జడ్‌పి హైస్కూలులో ఆంగ్ల ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. గతంలో ఆయనకు 2021-22 బడ్జెట్ పై సూచనలు ఇచ్చినందుకు కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ నుంచి కూడా ప్రశంసలు అందుకొన్నారు. దీనిపై పలువురు ఉపాధ్యాయులు, విద్యాశాఖాధికారులు, పుర ప్రముఖులు ఆయనను అభినందించారు.

రాజంపేట స్థానాన్ని బహుమతిగా ఇస్తాం

ప్రజాశక్తి-నందలూరు

వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో రాజంపేట స్థానాన్ని జనసేన పార్టీకి బహుమతిగా అందచేస్తామని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, రాజంపేట నియోజకవర్గ జన నాయకులు అతికారి దినేష్ లు పేర్కొన్నారు. శనివారం నందలూరు షాదీఖానాలో జనసేన క్రియాశీలక సభ్యత్వాల కిట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి గడచిన నాలుగు సంవత్స రాలలో రాయలసీమకు చేసిన నాలుగు మంచి పనులు ఏమైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. శంకుస్థాపనలు తప్ప ఏవి ప్రారంభాలకు నోచుకోలేదన్నారు. అన్నమయ్య వరదల్లో నష్టపోయిన మందపల్లె, చెయ్యేరు నదీపరి వాహక ప్రాంతాల్లోని ప్రజలకు ఏమేలు చేయలేదన్నారు. జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ అసత్య హామీలు ఇవ్వరని, పేదల పక్షాన ఉంటారని, ఆయనను ఒక్కసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్ల మెంటు నాయకులు ముఖరం చాంద్, అధికార ప్రతినిధి కీర్తన, జన సైనికులు సుబ్బరాయుడు, నాగరాజు, గోపి, ఉపేంద్ర, మస్తాన్, వీర మహిళ కొట్టే మణెమ్మ, జనసైనికులు పాల్గొన్నారు.

జన సైనికులకు కిట్లను పంపిణీ చేస్తున్న నాయకులు

నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం

ముస్తాబైన కన్యకా పరమేశ్వరి ఆలయం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట అమ్మవారిశాలలో ఈ నెల 15 నుంచి 25 వరకు నిర్వహించినున్న దసరా ఉత్సవాలకు అమ్మవారిశాల సర్వాంగ సుందరంగా ముస్తాబై సిద్ధంగా ఉందని ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు గ్రంధి సత్యానారాయణ తెలిపారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ దేవి నవరాత్రి ఉత్సవాల ప్రారంభోత్సవానికి సంబంధించిన అన్ని ముందస్తు ఏర్పాట్లను పూర్తి చేశామని చెప్పారు. ఈ పర్వదినాల్లో 23 న దుర్గాష్టమి, 24 మహర్నవమి మరియు 25 తేదీ విజయదశమి పండుగకు అత్యంత భక్తాదుల రద్దీగల ముఖ్యమైన రోజులని తెలిపారు. 15న దీక్షాబంధన అలంకారము, 16 న బిల్వవృక్ష నివాసిని అలంకారం, 17న అన్నపూర్ణ అలంకారం, 18న కృష్ణమూర్తి అలంకారం, 19న మోహినీదేవి అలంకారం, 20న సరస్వతీదేవి అలంకారం, 21న మీనాక్షిదేవి అలంకారం, 22న మహి షాసుర మర్దిని అలంకారం, 23న మహాలక్ష్మి దేవి అలంకారం, 24 న శ్రీ రాజరాజేశ్వరీదేవి అలంకారం, 25న ఊంజలీదేవి అలంకారం ఉంటుం దన్నారు. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించడంతోపాటు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. వాసవి కన్యక అమ్మవారికి 9 రోజుల పాటు దేవిఅలంకారాలపై తగిన శ్రద్ధ పెట్టి జాగ్రత్తలు తీసుకున్నామని, నిత్య హెూమాలు, జపాలు జరగనున్నాయని తెలిపారు. 20న బిందె సేవ గ్రామోత్సవం, 23న గుండప్రవేశం, శమీపూజకు అమ్మవారి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. భక్తిశ్రద్ధలతో ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రతిరోజూ నిర్వహిస్తామన్నారు. భక్తాదులకు నిరంతర పర్యవేక్షణ, అవాం ఛనీయ ఘటనలు నివారిస్తూ భద్రతా నిఘా ఏర్పాట్లు చేపట్టామన్నారు.

'శ్రీ భువన విద్యాలయం'లో ఘనంగా దసరా వేడుకలు

పీలేరు: పీలేరు శ్రీ భువన విద్యాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు దేవతల వేషధారణలో దసరా పండుగ ప్రాముఖ్యతను కళ్లకు కట్టినట్లు నాటకం ప్రదర్శించారు. దుర్గామాత మహిషాసురుని సంహరించే ఘట్టం అందర్నీ అలరించింది. ఈ సందర్భంగా శ్రీ భువన విద్యాలయ కరస్పాండెంట్ ఉమారమాదేవి, ప్రిన్సిపల్ గుణలక్ష్మీ మాట్లాడుతూ విజయదశమి అంటే చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఈ పండుగను 'విజయదశమి'గా జరుపుకుంటారని అన్నారు. విద్యార్థులు కూడా చెడును విస్మరించి మంచి వైపు పయనించి అందరి మన్ననలు పొంది బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్ర మంలో తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవదేవి వేషధారణలో భువన విద్యార్థులు

జాతీయ స్థాయికి ఎదగాలి : స్టెప్ సిఇఒ

ప్రజాశక్తి -కడప

రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో తమ ప్రతిభను ప్రదర్శించి జాతీయ స్థాయికి ఎదగాలని స్టెప్ సిఇఒ సి. సాయి గ్రేస్ అన్నారు. జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం కడపలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ మైదానంలో రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమని అన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే 13 జిల్లాలకు చెందిన బాలుర జట్లు, మహిళల జట్లు గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగాలన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు. ప్రభుత్వం కూడా క్రీడలను ప్రోత్సహిస్తుందని అన్నారు. హ్యాండ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ రాజు, కడప జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు లయన్ కె. చిన్నపరెడ్డి మాట్లాడుతూ కడపలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం చాలా సంతోషకరమైన విషయం అన్నారు. కార్యక్రమంలో జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ చైర్మన్ మల్లికార్జున రెడ్డి, స్పాన్సర్స్ కంచి గోపికృష్ణ, కంచి సురేంద్ర, రాజారత్నం ఐజాక్, రోడా మెర్సీ, కార్పొరేటర్ సూర్యనారాయణ, కిరణ్, జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.వి. శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి సింధూరి, కోశాధికారి బాబర్, సంయుక్త కార్యదర్శి బసిరెడ్డి, కిషోర్ రెడ్డి, ఉపాధ్యక్షులు వెంకట సునీల్, కార్యవర్గ సభ్యులు, అన్ని జట్ల మేనేజర్లు, కోచ్‌లు, అబ్జర్వర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

మొదటిరోజు విజేతలు వీరే..

కడప జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా పోస్ట్ అథారిటీ మైదానంలో శనివారం రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. ప్రారంభ రోజు జూనియర్ బాయ్స్ విభాగంలో నిర్వహించిన పోటీలలో శ్రీకాకుళం జట్టుపై కడప జట్టు విజయం సాధించింది. ఈస్ట్ గోదావరి జట్టుపై వెస్ట్ గోదావరి జట్టు విజయం సాధించింది. అనంతపురం జట్టుపై ప్రకాశం జట్టు విజయం సాధించింది.

సీనియర్ మహిళల విభాగంలో చిత్తూరు జట్టుపై కడప జట్టు విజయం. కర్నూలు జట్టువై ఈస్ట్ గోదావరి జట్టు విజయం.నెల్లూరు జట్టుపై విజయనగరం జట్టు విజయం సాధించింది. అనంతపురం జట్టుపై కృష్ణ జిల్లా జట్టు విజయం సాధించింది.

ప్రతి సామాజిక వర్గానికీ న్యాయం

ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా, ఎంపీ వై.ఎస్.అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని, ఉన్నత పదవులు అందుతాయని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా, ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి అన్నారు. శనివారం రవీంద్ర నగర్ లోని యూఎస్ మహల్ ఫంక్షన్ హాల్ లో జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్, వైస్ చైర్మన్, కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంజద్ బాషా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అన్ని సామాజిక వర్గాల వారికి, కష్టపడి పని చేసిన వారికి ఉన్నత పదవులు అందించి న్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలలో ఈ విధంగా అన్ని సామాజిక వర్గాల వారికి న్యాయం చేయలేదని తెలిపారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ మదీనా దస్తగిరి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఎంతో కష్టపడి, ఇబ్బందులను, సమస్యలను అధికమించి న్యాయం చేస్తూ పని చేశారని అభినందిస్తూ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ గా పదవి రావడం ఎంతో సంతోషించ దగ్గ విషయమన్నారు. ఎంపీ వై.ఎస్. అవినాష్ రెడ్డి మాట్లాడుతూ కష్టపడి పనిచేసి ఉన్నత పదవులను అందుకోవాలన్నారు. జగన్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి జగనన్నతోనే తన రాజకీయ ప్రయాణంలో పెట్టుకుని అప్పటి పని చేసిన మదీనా దస్తగిరి అని అన్నారు. మైదుకూరు శాసనసభ్యులు ఎస్ రఘురామిరెడ్డి మాట్లాడుతూ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ మదీనా దస్తగిరి ఎంతో కష్టపడి పని చేశారని ఆయనకు ఈరోజు న్యాయం జరిగిందని ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు తప్పక ఉంటుందన్నారు. ముస్లిం మైనార్టీ పక్షపాతిగా సిఎం జగన్ అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు.ముస్లిం సంక్షేమానికి కృషి చేస్తున్నారని అన్నారు. తొలుత షేక్ మదీనా దస్తగిరి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ తోపాటు జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ సయ్యద్ అలీ అక్బర్ (రిజ్వాన్),జిల్లా వక్ఫ్ బోర్డు సభ్యులు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, రూపనగుడి అబ్దుల్ సుభాన్, షేక్ గౌస్ పీర్, పఠాన్ ఖాదిరుల్లా, చింతపల్లి షశావల్లి, ఇస్మాయిల్ సాబ్ గారి అన్వర్ సాబ్, షేక్ మహబూబ్ బాషా, షేక్ మహమ్మద్ ఉమర్, షేక్ కరిముల్లా లు జిల్లా వక్ఫ్ బోర్డు కార్యవర్గం సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. పెద్ద ఎత్తున వారికి పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ సురేష్ బాబు, రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, నాయకులు, నాయకురాళ్ళు, అభిమానులు, అధికారులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని దుకాణాలు.. పట్టని అధికారులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో అనధికారికంగా దుకాణాలు ఏర్పాటవుతున్నా.. సంబంధిత అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. కొందరు అనధికారిక దుకాణాలు ఏర్పాటు చేసుకుని తమ వ్యాపారాలు సాగిస్తున్నారు. ఎవరికి వారే యమునా తీరే అనే చందంగా అధికారులు వ్యవహరిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. వీటిపై అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. అనధికార దుకాణాల వల్ల బస్సు ఎక్కాలన్నా, దిగాలన్నా ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. తమ సమస్యను స్వయంగా ప్రయాణికులే ప్రొద్దుటూరు ఆర్‌టిసి డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేసినా, ఎలాంటి ఫలితంలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టు నెలలో ఆర్‌టిసి డిఎం మల్లికార్జునరెడ్డి ఎర్రగుంట్ల బస్టాండ్ ఆవరణను పరిశీలించి అనధికారికంగా ఏర్పాటు చేసిన రెండు దుకాణాలను తొలగించాలని యజమానులకు సూచించారు. కానీ ఇప్పటివరకు తొలగించకపోవడంతో అధికారులపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దుకాణ యజమానులకు రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయని, ఆ ఒత్తిళ్ల కారణంగానే అనధికార దుకాణాలైనా కూడా తొలగించే చర్యలు చేపట్టడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అనధికార దుకాణాలను తొలగించే చర్యలు చేపట్టాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు. ప్రొద్దుటూరు ఆర్‌టిసి డిఎంను వివరణ కోరగా.. నాలుగు రోజుల్లో అనధికార దుకాణాలను తొలగించే చర్యలు చేపడతామన్నారు. ఇప్పటికే యజమానులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.

అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన దుకాణం

మూతపడివున్న మరుగుదొడ్లు

ఆర్‌టిసి బస్టాండ్‌లో మూతపడ్డ మరుగుదొడ్లు

- ఇబ్బందులకు గురవుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రంలోని గాలివీడు ఆర్‌టిసి బస్టాండ్‌లోని మరుగుదొడ్లను మూసివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతు న్నారు. మహిళలు, మహిళా కండక్టర్లు తీవ్ర అసౌకర్యానికి గురవు తున్నారు. బస్టాండులో మహిళలకు,పురుషులకకు రెండు మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. టెండర్ దారుడు ఇక్కడ పనిచేస్తున్న వ్యక్తికి డబ్బులు చెల్లించకపో వడంతో మూసివేశారు. పట్టణ పరిధి గేటు నుంచి పక్కిరెడ్డి గారిపల్లి వరకు రెండు కిలోమీ టర్ల వరకు వ్యాపించి 50 వేల జనాభా కలిగి వుంది. అయినా ఎక్కడా పబ్లిక్ టాయిటెల్‌లు లేవు.ఇప్పటికైనా ఆర్‌టిసి అధికారులు స్పందించి మరుగు దొడ్లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణీకులతో పాటు పట్టణ ప్రజలు కోరు తున్నారు. పంచాయతీ అధికారులు కూడా పట్టణంలో అక్కడక్కడ రద్దీ ప్రాంతాల్లో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎఎస్ఐ

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

ప్రజాశక్తి-నందలూరు

ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, లేనిపక్షంలో చర్యలు చేపట్టడం జరుగు తుందని ఎఎస్ఐ శంకర్‌నాయక్ తెలిపారు. శనివారం స్థానిక బస్టాండ్ కూడలిలో పోలీసుల ఆధ్వర్యంలో వాహన దారులను ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి వేగం తగ్గించాలని, ప్యాసింజర్లతో గౌరవంగా మాట్లాడాలన్నారు. పూర్తిస్థాయిలో రికార్డులు ఉండాలని, బాలురు ఆటో, వాహనములు నడపంకూడదని సూచించారు. కొత్త వ్యక్తుల గురించి, నేరస్తుల గురించి ఏదైనా సమా చారం ఉన్నట్లయితే పోలీసులకు తెలపాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

హక్కులను హరిస్తున్న యాజమాన్యాలు : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో ప్రయివేట్, కార్పొరేటు పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుల హక్కులను యాజమాన్యాలు హరిస్తాయని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. దసరా సెలవుల్లో ప్రయివేట్ ఉపాధ్యాయులకు క్లాసు వర్క్, వర్క్ షాప్ పేరుతో నిర్వహిస్తున్న వారిని డివైఎఫ్ఐ అధ్వర్యంలో అడ్డుకుని ఉపాధ్యాయులకు కూడా సెలవులు ఇవ్వాలని వారిని పంపించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికే దసరా సెలవులు 14 నుంచి 24 వ తేదీ వరకు ప్రకటిం చిందని చెప్పారు. సెలవులలో స్కూల్స్ ఎటువంటి పరిస్థితులలో తరగతులు నిర్వహించ వద్దు అని, అలా నిర్వహించిన వాటి పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించిందన్నారు. ఇచ్చే జీతం తక్కువ, పని ఒత్తిడి ఎక్కువన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రయివేట్, కార్పొరేటు స్కూల్స్ పై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సునీల్,రాజేంద్ర ప్రసాద్, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం.ఓబులేసు, జిల్లా సహాయ కార్యదర్శి తులసిశ్వర్ యాదవ్, నాయకులు సూరి పాల్గొన్నారు.

పిసిసి ఉపాధ్యక్షులుగా షేక్ నజీర్ అహ్మద్

కడప : పిసిసి ఉపా ధ్యక్షులుగా షేక్.నజీర్ అహ్మద్ నియమి తుల య్యారు. ఈ సంద ర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్య క్షులు మల్లెం విజ యభాస్కర్ శని వారం అహ్మద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలి పారు. కార్యక్రమంలో బిసి సెల్ రాష్ట్ర కన్వీనర్ జోడు నాగరాజు, మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆరిపుల్లా, మాజీ జాయింట్ సెక్రె టరీ కర్నాటి చంద్రశేఖర్ రెడ్డి, నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు ఆనంద్ కుమార్, జానొల్ల శ్రీరాములు, కేశవ, రఫిఖాన్ పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాల్లో జ్ఞానజ్యోతిని వెలిగించాలి

విద్యార్థుల జీవితాల్లో జ్ఞాన జ్యోతులు వెలిగించాలని సర్వశిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి అన్నారు. మూడు నుంచి ఎనిమిది సంవత్సరాల వయస్సు గల పిల్లలు చదవడం ,రాయడం, చతుర్విధ ప్రక్రియలను చేయగలిగేలా చేయడం శిక్షణ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. శిక్షణలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మండల స్థాయి శిక్షణ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్‌కు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి క్షేత్రస్థాయిలో అమలు అయ్యే విధంగా చేయాలన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు సంస్కారం, జ్ఞానంతో పాటు లోకజ్ఞానం పెంపొందించే దిశగా ప్రయత్నించాలన్నారు. ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడూ శిక్షణను పొంది నాణ్యమైన విద్యాబోధనకు కృషి చేయాలన్నారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలందరూ చిన్నపిల్లలు కాబట్టి వారికి ఆటపాటలు, కృత్యాలు, కథల ద్వారా బోధన చేసినట్లయితే చక్కగా అవగాహన చేసుకుని నేర్చుకోవడానికి వీలవుతుందన్నారు.కార్యక్రమానికి రాష్ట్ర పరిశీలకులుగా అల్లం సత్యానారాయణ, నోడల్ అధికారిగా వాణిశ్రీ , పర్యవేక్షకురాలిగా అకాడమీక్ మానిటరింగ్ అధికారి ధనలక్ష్మి , రామాంజనేయ రెడ్డి విజయ లక్ష్మి, కీ రిసోర్స్ పర్సన్ లుగా శ్రీ చంద్ర ఓబుల్ రెడ్డి, శోభారాణి, శ్రీహరి, నాగేశ్వరరావు, సౌభాగ్యమ్మ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

యువతిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

యువతి అదృశ్యం

- మూడు గంటల్లోనే చేధించిన పోలీసులు

ప్రజాశక్తి-నందలూరు

పొత్తపి గ్రామానికి చెందిన సాయితేజ అనే యువతి ఈనెల 13న ఇంటి నుంచి వెళ్లిపోవడంతో, ఫిర్యాదు అందుకున్న స్థానిక పోలీసులు యువతి ఆచూకీ మూడు గంటల్లో చేధించి తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన శనివారం నందలూరు పోలీస్ స్టేషన్లో చోటుచేసుకుంది. యువతి తండ్రి నరసింహులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించి కేసు నమోదు చేసి మూడు గంటల వ్యవధిలోనే నెల్లూరులో ఉన్నట్లు గుర్తించి వెంటనే పోలీసులు అక్కడికి వెళ్లి యువతిని తీసుకుని వచ్చి తన తల్లిదండ్రులకు అప్పగిం చారు. దీంతో బాధితులు, బంధువులు పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.